కథానిక

# విలువలేని సౌందర్యం

"మంజుశ్రీ"

రమణమూర్తి ఆ గదిలోచేరి పదిహేను రోజులైంది. అతనికాగది ఎంతో నచ్చింది. రోడ్డువారగది కిటికీ తలుపులు తెరిస్తే రెండు కొబ్బరిచెట్లు కనిపిస్తవి కిటికీ కటొకటీ, ఇటొకటీ. ఆ ఇంటికి తూర్పు వాకిలి అది మేడమీది గది. చల్లటి గాలి. రెండు అలమరాలున్నాయి. అందుకే ఆ గది అతడికి నచ్చింది అలమరాలనిండా పుస్తకాలు పేర్చుకున్నాడు. కాంప్‌కాట్ వేసుకున్నాడు. చక్కటి గాజుకూజా కొనుక్కుని టేబిలుమీద పెట్టుకున్నాడు టేబిల్ ఇంటివారిదే. కాంప్‌కాట్ మీద పడుకుని గదంతా కలయచూసి పట్టపగలే లైటు వేసుకుని తృప్తిగా నిట్టూర్చాడు.

నాలుగు రోజులు గడిచిన తర్వాత అతడికి కొద్దిగా అసంతృప్తి కలిగింది. కొద్దిగా భయమేసిందికూడా. నీళ్ళు క్రిందినించి తెచ్చుకోవాలని కాని, ప్రొద్దున ఎనిమిదికాందే, క్రిందికి పంపుదగ్గరికి వెళ్ళటానికి వీలుండదని కాని అతడు బాధపడలేదు ఆ సాయంత్రం కిటికీ తెరిచి అక్కడ కుర్చీలో కూచున్నాడు కాస్త తలనొప్పిగా వుండి సాయంత్రం ఎక్కడికీ పోవాలనిపించలేదు అతడికి చల్లగాలి తగుల్తుంది కదా అని కూచున్నాడు ఎదురింటి మేడమీద తన కిటికీ ఎదురుగా కిటికీ తెరచివుంది. ఆ కిటికీలోంచి చూశాడు. అక్కడ పెద్ద మంచంమీద, ఎవరో సుందరాంగి కూచునుంది రమణమూర్తి వేపు చూసింది. విచారంగా చూసింది. ఆ అమ్మాయి ముఖంనిండా దట్టంగా ఏవో బాధలు అల్లుకున్నట్లు రమణమూర్తికి కనిపించింది ఆ అమ్మాయి కళ్లు గుండ్రంగా తిప్పి చూసింది. ఎంతో వింతగా చూసింది. మళ్లీ కళ్లు తిప్పేసుకుంది.

పడమటినుంచి సాయంకాలపు నీరెండ ఎదురింటి మేడమీదపడి మెరుస్తున్నది ఆ దృశ్యం తమాషాగా వుంది రమణమూర్తికి. ఎదురింట్లో పనసచెట్టు వుంది ఆ చెట్టుమీద మీద యెఱ్ఱటి యెండ మెరుస్తున్నది అటే చూస్తూ కూచున్నాడు రమణమూర్తి ఆ అమ్మాయి మళ్ళీ రమణమూర్తివేపు చూసింది. ఇతడూ చూశాడు. ఆ అమ్మాయి బాధగా నవ్వింది. ఆ నవ్వు వెనకాల ఎంతో విషాదం దాగివుంది ఈసారి నీరెండ కిటికీలోంచి ఆ అమ్మాయిమీద పడింది. ఆ అమ్మాయి కట్టుకున్న చీర మెరిసిపోయింది. ఆ అమ్మాయి ముఖమంతా కందిపోయినట్లనిపించింది రమణమూర్తికి.

ఆ అమ్మాయి అక్కడినుంచి వెళ్ళిపోతుందేమోననుకున్నాడు రమణమూర్తి. అసలా అమ్మాయి కదిలే ప్రయత్నమే చెయ్యలేదు. కిటికీ మూసేసి ఎక్కడికన్నా వెళ్ళిపోదామనుకున్నాడు కాని అలా చెయ్యలేక పోయ్యాడు. అటే చూస్తూ కూర్చున్నాడు ఆ అమ్మాయి ఏవో పత్రికలు చదువుతూ నడుమ నడుమ ఇతడి వేపు చూసేది. ఆ చూపులు గుచ్చుకునేట్లు వుండేవి !రమణమూర్తికి వళ్లు మండుకపొయ్యేది. ఆ అమ్మాయికి వినపడేంత చప్పుడుతో కిటికీలు భళ్లున వేసేద్దామనుకున్నాడు. కాని అలా చెయ్యలేక పోయినాడు. తన బలహీనతకు తన మీద తనకే కోపమొచ్చింది.

సంజవాలిపోయింది. చీకటి పడింది. ముందు ఆ అమ్మాయి గదిలోనే లైటు వెలిగింది. రమణమూర్తికి చాలా చిన్నతనమనిపించింది. తన మీద తన కసహ్యం కూడా కలిగింది. చీకటి పడిందని కూడా తను గుర్తించలేక

పొయ్యాడు. ఆ అమ్మాయే గుర్తించింది. ఆ అమ్మాయి మంచంమీదనుంచి లేచి క్రిందికి దిగుతుందేమో చూద్దామనుకున్నాడతను. ఎంత పొడుగుంటుందో చూడాలి అన్నారెవరో తనలో. రమణమూర్తి తనను తాను తిట్టుకున్నాడు. కాని అలానే కూచున్నాడు. ఆ అమ్మాయి ఎంతకూ దిగిపోలేదు. విసుక్కుంటూ వొక్కొక్క మెట్టే దిగి హొటలుకేసి నడచిపొయ్యాడు హొటలునుంచి భోజనం చేసి వస్తూ, గదికి వెళ్ళగానే ఆ కిటికీ మూసేద్దామనుకున్నాడు. అలానే కిటికీ దగ్గరి కొచ్చాడు. ఆ అమ్మాయి పడుకుని చదువుకుంటున్నది. అతడి మనసంతా అదోలా అయిపోయింది ఈ దయ్యం ఇక ఎప్పుడూ ఇక్కడనుంచి కదలదు గాబోలు, అనుకున్నాడు

ఆ రాత్రి అతడికి తన గది గురించి అసంతృప్తి కలిగింది మొదలు అద్దె ఎక్కువైనా, అతడికేమీ అనిపించలేదు ప్రొద్దున ఎనిమిది దాటింది క్రిందికి, పంపువద్దకు రాగూడదన్నా, అతడికేమీ అనిపించలేదు నెత్తిన పాలు పోశారు, అసలు ఎనిమిదికి ముందు నేను పక్కమీదినుంచి లేస్తేగా అని సరిపెట్టుకున్నాడు. కిటికీ ప్రక్కన కొబ్బరిచెట్లు చూసి మురిసిపొయ్యాడు. కాని ఇవాళ ఎదురింటి మేడమీద గదిలో ఆ అమ్మాయి కన్పించగానే, అతడికి దిగులు పట్టుకుంది. తన బలహీనత తానెరుగును. తన మీద తనకు పూర్తిగా అపనమ్మకమే ఇక ఆ కిటికీలో కూర్చొని ఎదురింటి మేడమీద గది కిటికీవేపు చూస్తుంటే చదువెట్లా సాగాలి. తానెందుకొచ్చాడు, అమ్మ నొదిలి ఇంత దూరం. అయినా ఆ అమ్మాయి అలా చూస్తుందేం. కళ్ళు గుండ్రంగా, భలే తమాషాగా వుంటాయి. ముఖం బాగుంటుంది. దిగులుగా నవ్వుతుంది. ఎందుకో దిగులుగా నవ్వుతుంది. ''మళ్ళీ మొదలైందీ ఆ అమ్మాయిని గూర్చి ఆలోచించటం'' అని విసుక్కుని, తనని తానే తిట్టుకుని నిద్రపట్టే ప్రయత్నం చేశాడు రమణమూర్తి.

ప్రొద్దుటే ఏడున్నరకి నిద్రలేచి మళ్ళీ కిటికీలోంచి చూశాడు. ఆ అమ్మాయి గది కిటికీ మూసి వుంది. అతడికదోలా అనిపించింది. మళ్ళీ సమర్థించుకుని క్రిందికి దిగిపోయినాడు. స్నానంచేసి తల దువ్వుకుంటూ కిటికీలోంచి చూడగానే, ఆ అమ్మాయి కన్పించింది నిన్నటి అమ్మాయి. ఆ దిగులుగా నవ్వే అమ్మాయి కాఫీ తాగుతున్నది. ప్రక్కన అక్కో చెల్లెలో ఎవరో కూచుని కాఫీ త్రాగుతున్నారు. ఏమి వయ్యారం? అనుకున్నాడు రమణమూర్తి తానూ కాఫీకి వెళ్ళిపొయ్యాడు.

ఆరోజునుంచీ సాయంత్రాలు బయటికెళ్ళడం మానేశాడు రమణమూర్తి. పడుకోబొయ్యే ముందు, తనని తానే తిట్టుకుంటున్నాడు. విసుక్కుంటున్నాడు. రేపటినుంచి ఆ కిటికీ తెరవకూడదనుకుంటున్నాడు. కాని ఆ కిటికీ తలుపులు దూరదూరంగానే వుంటున్నాయి, ప్రొద్దునతడు స్నానంచేసి తల దువ్వుకునేవేళా, ఆ అమ్మాయి కాఫీ త్రాగేవేళ, సాయంత్రం అతడు ఆ కిటికీలో కూచునేవేళ, ఆ అమ్మాయి పత్రికలు చదువుకుంటూ, నడుమ నడుమ తలెత్తి చూస్తూ, దిగులుగా నవ్వే వేళ అది మామూలైపోయింది రమణమూర్తికి పదిహేను రోజులు గడిచేసరికి ఇక తనకు వశం కాదనుకున్నాడు, ఆ కిటికీ తలుపులుమూయటానికి అతడిక్కొక్కప్పుడు చాలా దిగులేస్తున్నది అయినా అలానే కాలం వెళ్లదీస్తున్నాడతడు ఆ అమ్మాయి సౌందర్యం అతడికి దిగ్భ్రమ కలిగించి, పిచ్చివాణ్ణి చేస్తున్నది ఒక రోజు అతడు చూశాడు ఆ అమ్మాయి జడ తన బారెడు పొడుగుంటుంది. అతడు చాలా ఆశ్చర్యపడుతున్నాడు ఆ అమ్మాయి అక్కడనుంచి ఎప్పుడూ కదలదు. తన లాగానే ఆ అమ్మాయి కూడా బాధపడుతున్నదా? అలా అనుకోగానే అతడికెన్నో తీయని అనుభూతులు కలిగినై.

ఒక రోజు ఆదివారం అతడు కిటికీ వారనే కూర్చున్నాడు ఆదివారం పూట సినిమాకెళ్ళే అలవాటతడికి. కాని అది కూడా మానుకున్నాడు. అతడు ఎంతో ఆశ్చర్యపడ్డాడు. ఆ అమ్మాయి ఎదురుగా కుర్చీలో పళ్లెం పెట్టుకుని భోంచేస్తున్నది. అతడికి భయమావేశించింది. ఆ అమ్మాయి కేదైనా జబ్బా! అతడు గుండె

దిటవుచేసుకున్నాడు. ఆ అమ్మాయి చాలా ఆరోగ్యంగా కనపడుతుంది. తనను చూస్తూ తినాలని బుద్ధేసిందేమో! తను సినిమా మానుకోలే, చూస్తూకూచోటానికి. మనసు నలా సరిపెట్టుకున్నాడు. తను భోజనం చేస్తుంటే చూస్తున్నాడని ఆ అమ్మాయి చాలా సిగ్గుపడ్డది కిటికీలు మూయించింది. రమణమూర్తికి వళ్లు మండుకపోయింది అయినా అతడలానే కూర్చున్నాడు. ఆ అమ్మాయి భోజనం కాగానే కిటికీలు తెరువబడ్డాయి అతడింకా అక్కడే కూచుని వుండటం చూసి ఆ అమ్మాయి నవ్వింది. దిగులుగా నవ్వలేదు స్వచ్ఛంగా నవ్వింది.

వాళ్ల సంగతులన్నీ కనుక్కోవాలనుకున్నాడు రమణమూర్తి

ఆ రాత్రి అతడికో కల వచ్చింది

అతడిచేతులు విపరీతంగా పెరిగిపోయినయ్. ఎంత పెరిగిపోయినవో చెప్పలేం కబంధహస్తాలైనాయి అవి కిటికిలోంచి అవతలికి పెట్టాడు ఎదురింటి గోడమీద గది కిటికీదాకా ఆ చేతులు సరిపోయినయ్. ఆ అమ్మాయి, అదే దిగులుగా నవ్వే అమ్మాయి, అతడి చేతుల్లోకి వచ్చింది. అతడు దగ్గరగా, హృదయానికి దగ్గరగా తెచ్చుకున్నాడా అమ్మాయిని. అబ్బ! ఎంత అందంగా వుంది. అంత ,అందం అతడెక్కడా ఇంతకు ముందుకు చూడలేదు. ఆ అమ్మాయి తీయగా మాట్లాడింది. తీయగా పాటలు పాడింది. గుండెలు కోసేట్లు పాడింది. మల్లెపూల వాసనలా మత్తు కలిగిస్తుంది ఆ అమ్మాయి స్వరం. మళ్ళీ ఆ అమ్మాయిని వాళ్ళ గదిలో వదిలిపెట్టి వచ్చినై అతడి చేతులు. ఆ అమ్మాయి తననుచూసి దిగులు లేకుండా నవ్వింది.

ప్రొద్దుటే అతడు లేవగానే తన చేతులవేపు చూసుకున్నాడు. అతడికి విపరీతంగా నవ్వొచ్చింది. అలా నవ్వుతుండగా అతడికి కమ్మటి స్వరం విన్పించింది. కిటికీలోంచి చూశాడతను. ఆ అమ్మాయి దుప్పటి ముసుగు తొలగించి కమ్మగా పాడుతున్నది.

అతడి హృదయమంతా ఆ అమ్మాయి వశపర్చుకుంది. ఆ అమ్మాయి లేందే తాను బ్రతకలేననుకున్నాడతను. మధ్యాహ్నం కాలేజీనుంచి వస్తుంటే, ఎదురింటి మేడమీద వాళ్లకు పని చేసే పనిపిల్ల కన్పించింది. తనచుట్టూ చూసుకుని భయపడుతూ, ఆ అమ్మాయిని పిలిచాడు రమణమూర్తి ఆ అమ్మాయి నవ్వుతూ దగ్గరి కొచ్చింది. అసహ్యంగా నవ్వింది.

రమణమూర్తి తడబడ్డాడు. అతడి కెందుకో భయమేసింది. చుట్టూ చూసుకున్నాడు. ఏం అడగాలో అతడికి తోచలేదు పనిపిల్లకు పదిహేనేళ్లుంటాయి. అతడలా యిదవుతుంటే, ఆ అమ్మాయి అసహ్యంగా నవ్వుతూ "ఏటండీ?" అంది

అతనలా నవ్వకపోతే బాగుండును, అనుకున్నాడు రమణమూర్తి.

'నాకు పనుంది, నేనెళ్లాలి" అంది పనిపిల్ల.

"నా గది వూడవాలి. కిందినుంచి మంచి నీళ్లు తెచ్చిపెట్టాలి ఏం! చేస్తావా?" అన్నాడు, తన తెలివికి తానబ్బురపడ్డాడు. అభినందించుకున్నాడు కూడా!

"అమ్మ బాబో, టూ డెంట్ల గదుల్లోనా, నే పనికిరాను" అంది. మళ్ళీ అదే నవ్వు.

రమణమూర్తికి కళ్లు తిరిగినై. పాతాళంలోకి కృంగిపోతున్నట్లనిపించింది.

ఏంటది మాట్లాడుతున్నది ఛా, ఛా! గబగబ అడుగులేశాడు.

పనిపిల్ల వెనకనుంచి అంది.

"అయినా, మాఅమ్మ నడుగుతా."

అతడు వినిపించుకోలేదు. అయినా ఆ మాటలతనికి వినపడ్డాయి. అతడు గదికి వెళ్ళిపోయాడు. కిటికీలోంచి చూశాడు. ఆ అమ్మాయి మంచం మీద కూచుని, ఏదో చదువుకుంటున్నది. కళ్ళ వెంబడి నీళ్ళు కారుస్తున్నది. రమణమూర్తి గట్టిగా దగ్గాడు. ఆ అమ్మాయి వులిక్కి పడింది. చప్పున పుస్తకం తొలగించి చూసింది. సిగ్గుపడింది. కళ్ళనీళ్ళు తుడుచుకుంది. ఆ అమ్మాయి ముఖమంతా వాడిపోయింది. అతడనుకున్నాడు. "ఆ అమ్మాయి ఏదైనా కథ చదువుతున్నదేమో దాన్నిండా కష్టాలు ఎక్కువేమో? విషాదాంతమేమో?

(తరువాయి 39-వ పేజీలో)